# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాలుగు రోజుల లండన్ పర్యటన ఈరోజుతో ముగియనుంది.**

2. **గడువుకు ముందే భోగాపురం విమానాశ్రయం పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు.**

4. **డ్రగ్స్, గంజాయి, అక్రమ మద్యం వంటి వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.**

5. **ప్రపంచ సునామీ అవగాహనా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాలుగు రోజుల లండన్ పర్యటన ఈ రోజుతో ముగియనుంది. ఈ రోజు మధ్యాహ్నం లండన్ నుంచి బయలుదేరి, రాత్రికి హైదరాబాదు చేరుకుంటారని అధికారులు వెల్లడించారు. రేపు ఉదయం హైదరాబాదు నుంచి గుంటూరు జిల్లా ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లాలో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం నుంచి వచ్చే డిసెంబర్ లేదా జనవరి తొలి వారంలో విమానాల రాకపోకలను పరీక్షించనున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పనులను ఆయన నిన్న పరిశీలించారు. విమానాశ్రయం పనులు 91.7 శాతం పూర్తి చేశామన్నారు. గడువుకు ముందే పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 33 సెకన్లు

--------------------------

డ్రగ్స్, గంజాయి, అక్రమ మద్యం వంటి వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైదరబాద్, బండ్లగూడాలోని రాష్ట్ర ఎక్సైజ్

అకాడమిలో కొత్తగా ఎంపికైన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిడెంట్లు, సబ్ ఇన్స్ పెక్టర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన అధికారులు ఎక్సైజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని గిరిజన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం 113 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ నిధుల్లో 83 కోట్ల రూపాయలు గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, 30 కోట్ల రూపాయలు గురుకుల పాఠశాలలకు కేటాయించినట్లు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..33 సెకన్లు

---------------------------

పలు సంస్థానాలను దేశంలో విలీనం చేయడం కోసం మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభ భాయ్ పటేల్ చేసిన సేవలు మరవలేనివని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్ పేర్కొన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిన్న నిర్వహించిన 'ఐక్యత యాత్ర'ను ఆయన ప్రారంభించారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ లోని మై భారత్ విభాగం ఈ యాత్రను నిర్వహించింది. శారదా నది ఒడ్డున ప్రారంభమైన ఐక్యత యాత్ర, సుంకరమెట్ట శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం వరకూ సాగింది. ఈ సందర్భంగా కోలాటాలు, వివిధ సాంస్కృత కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. గురుకులాల్లో పని చేస్తున్న నర్సులకు రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండల కేంద్రంలో నిన్న నిర్వహించారు. శిక్షణా తరగతుల ముంగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ..

వాయిస్... 35 సెకన్లు

---------------------------

అవినీతి నిర్మూలనకు ఉద్యోగులు తమవంతు సహకారాన్ని అందించాలని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా కోరారు. విజయవాడలోని డివిజనల్ ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్ సెస్ వీక్ -2025 ముగింపు సందర్భంగా నిన్న నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సర్దార్ వల్లభ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ పాటించడం జరుగుతుందన్నారు. ప్రతి రైల్వే ఉద్యోగి పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

---------------------------

ప్రపంచ సునామీ అవగాహనా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. 'సునామీకి సిద్ధంగా ఉండండి,

సునామీ సంసిద్ధతకు పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవం – 2025ను నిర్వహిస్తున్నారు. సముద్రంలో రాకాసి అలలు తీర ప్రాంతాలపై విరుచుకు పడడాన్నే సునామీ అంటారు. సముద్రంలో భూ కంపం సంభవించినపుడు, కొండ చరియలు విరిగి సముద్రంలో పడినపుడు, అగ్నిపర్వతాలు బద్దలైనపుడు, అత్యంత అరుదైన సందర్భాలలో 'ఉల్కాపాతం' సంభవించినపుడు సముద్రంలో భీకర అలలు ఎగిసి పడతాయి. తీర ప్రాంతాలపై ఈ విధంగా ఎగిసిపడే రాకాసి అలల వల్ల.. అపార ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుంది. సునామీల వల్ల ఏర్పడే ఈ పరిస్థితి పట్ల ప్రజలకు అవగాహన కల్పించి.. నష్ట తీవ్రతను తగ్గించడమే సునామీ అవగాహనా దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ 'జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ నెల 15వ తేదీ ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

---------------------------

పవిత్ర కార్తీక పౌర్ణమి పర్వదినం ఈ రోజు. మాసాలన్నింటిలోనూ అత్యంత ప్రాధాన్యత కలిగిన మాసం కార్తీకమాసం. ఈ మాసంలో వచ్చే పౌర్ణమికి మరింత ప్రాధాన్యత ఉంది. శివుడు – విష్ణువు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైన ఈ కార్తిక పౌర్ణమిని శరత్ పూర్ణిమ, త్రిపుర పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ఈ రోజు సముద్రస్నానం, శివారాధన, అభిషేకం, ఉసిరిక దీపారాధనలకూ విశేషమైన ఫలితం ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్, యానాంలో ఈరోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణం కేంద్రం అధికారి బి. శేఖర్ తెలియజేశారు.

తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================